# సంఘానికి వెన్నెముక!

"ఏయ్ పంతులూ, మా చిన్నోడు తెచ్చుకున్న కాగితం పుచ్చుకున్నావుటగా? నా సంగతి నీకు తెలీదల్లేవుంది. ఈ రాఘవులు పేరు చెబితే యీవూరు మొత్తానికే హడల్ తెలుసా? జాగ్రత్తగా వుండు" అంటూ ఒక బుగ్గమీసాల ఆసామి రామారావుని చెఱువుగట్టుదగ్గిర బెదిరించి చక్కాపోయాడు, కిర్రుచెప్పులు చప్పుడు చేసుకుంటూ.

రామారావుకి ఆవూరు క్రొత్త. స్కూల్ ఫైనల్ పరీక్షలకు వాచరుగా పై వూరు నుండి వచ్చాడు. పరీక్షలు ఆనాటినుండి ప్రారంభం. పరీక్ష హాల్లోకి వస్తూనే రామారావు విద్యార్థులను వారివద్దవున్న అనవసరమైన కాగితాలుకాని, చదువుకుందుకు తెచ్చుకున్న పుస్తకాలుగాని అవతల పెట్టి రమ్మని హెచ్చరించాడు. అంతా వెళ్ళి ఆ విధంగా చేసి వచ్చారు. రామారావు వరసవరసకీ మధ్య తిరుగుతూ అంతా తమ తమ నంబర్లు సరిగ్గా వేస్తున్నారో లేదో, వారపాటున పేరు రాస్తున్నారో అని ప్రతి విద్యార్థి దగ్గిరకి వెళ్ళి చూస్తున్నాడు. వాచరు తనవద్దకు రాగానే చివర కూర్చున్న రమణారావు అనే విద్యార్థి ముఖం వెలవెలపోయినట్లైంది. అది గ్రహించి రామారావు అన్సరు బుక్కులోని పేజీలు అటూ యిటూ తిప్పి చూశాడు. ఆ కాగితాలమధ్య ఒక జానెడు చదరంగావున్న కాగితం విద్యార్థి యింటి దగ్గిర వ్రాసుకొని తెచ్చినది కనబడింది. అందులో రెండు పద్యాలు, నాలుగు ప్రశ్నలకి జవాబులు వున్నాయి. ఇంకా పరీక్ష పత్రాలివ్వలేదు. వ్రాయడం ప్రారంభిస్తే గాని రిపోర్టు అవసరంలేదు. అందుచేత ఆ కాగితం తీసుకుని అక్కడనుండి వెళ్ళిపోయాడు రామారావు. ఆ సాయంకాలం షికారుగా ఆ వూరు చివరి చెఱువుగట్టు వైపు వెళ్ళాడు. అక్కడే తటస్థపడ్డాడు రాఘవులు.

ఆరు అడుగుల యెత్తు. అంతకుతగ్గ లావు. కాటికరంగు ఛాయ. బుంగ ముఖం. నోరు కప్పివేసివున్న దుబ్బు మీసాలు. రోకలి వంటి చేతికర్ర నేలమీద టక్కుటక్కుమని అనిస్తూ వచ్చాడు రాఘవులు.

రామారావుకి ఆ వచ్చిన అతను రాఘవులనీ, తను పొద్దున్న కాగితం లాక్కున్న కుర్రవాని తండ్రి అనీ అతని మాటలవల్ల తెలిసింది. మొదట ఎవరో తనలాగే అటు వస్తున్నారనుకున్నాడు. కాని, తన యెదురుగా వచ్చి నిలబడి, గుర్రుమంటూ, కేకలు పెట్టేసరికి ఖంగారుపడి పోయాడు రామారావు. రాఘవులు జేవురించిన కళ్లు, ముఖం చూసేసరికి భయంకూడా వేసింది. రాఘవులు వెళ్ళిపోయిన కొంతసేపటివరకు తను యెక్కడ వున్నదీ తెలియలేదు. రాఘవులు కట్టుపొగరుబోతు అని తెలుసుకున్నాడు రామారావు.

రామారావుకి అసలు వుద్యోగమే క్రొత్త. ఉద్యోగంలో ప్రవేశించి అది రెండో సంవత్సరం. బాల్యంలో పాఠశాలలో నేర్చిన నీతులు అతనిలో నాటుకుపోయాయి. సత్యానికీ, న్యాయానికీ, ఋజువర్తనానికీ ఎక్కువ ప్రాముఖ్యత యిస్తాడు.

## వేదుల మీనాక్షీదేవి

అవి కలవారికే వ్యక్తిత్వం అంటాడు. లంచగొండితనం, కాపీ చెయ్యడం అవినీతి అంటాడు; పాపం అంటాడు. పరీక్ష పోయినా మంచిదే అని ఆనందిస్తాడుగాని కాపీచేసి ప్యాసైనవాళ్ళని చూసి బాధపడతాడు. ఛీదరించుకుంటాడు. దానికితోడు తమ స్కూలు క్రొత్తభవనానికి ప్రారంభోత్సవం చెయ్యడానికి వచ్చిన విద్యామంత్రి ఉపన్యాసంలో ఉపాధ్యాయుల బాధ్యతలగురించి చెప్పిన మాటలు అతని ఆశయాలను యింకా బలపరిచాయి.

ఉపాధ్యాయుడు నిజంగా సంఘానికి వెన్నెముకవంటివాడు. వెన్నెముక బలంగా వుంటేనే శరీరం బలంగా వుంటుంది. దేశంలో వున్నటువంటి ఉన్నతోద్యోగుల నందర్నీ తయారుచేసిందెవరు? ఉపాధ్యాయుడే! అట్టి ఉపాధ్యాయుడు ఆదర్శవాదిగా వుండాలి. ఎల్లప్పుడూ తన కిచ్చే జీతమెంత? తను చేసే పనియెంత? అనుకోరాదు ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుల ఆర్థికపరిస్థితి బాగుపరచేందుకు మాప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోంది. ఒకవేళ ఆర్థిక పరిస్థితులవలన జీతాలను పెంచలేకపోయినా ఉపాధ్యాయుడు నిరుత్సాహపడకూడదు. నేటిబాలలే రేపు దేశనాయకులు కాబోతారు. అట్టివారిని ఆదర్శప్రాయులుగా చేయడమే తమ లక్ష్యంగా పెట్టుకోవాలి. ఈవిధంగా ఉపాధ్యాయుడు గొప్ప దేశసేవకుడు కాబోతున్నాడు."

ఆనాడు మంత్రి ఉపన్యాసం ఇంకా రామారావు చెవుల్లో మ్రోగుతోంది. నిజమే! కాని, ఉపాధ్యాయుని నీతులు, అతని ఆశయాలూ ఎవరికి లెక్క? అందులోనూ స్కూలు మేష్టరు మాట ఖాతరుచేసేవాళ్లెవరు? అందరికన్నా లోకువైనవాడు స్కూలు మేష్టరు! అందుకే "బ్రతుకు తెరువు లేకపోతే బడిపంతులు" అన్నారు.

విద్యార్థులు అల్లరిచేసినా పంతులుకే తప్పు. ఆ అల్లరి ఆయన చేసినట్లే. నోరు పెట్టుకుని అరిచి పాఠం చెబితే విద్యార్థులు వినక, అల్లరిచేసి, చివరికి ఫేలయితే ఆతప్పూ మేష్టరిదే! రిజల్ట్సు సరిగా లేవని రిమార్కు! వార్నింగు! తమ పిల్లలు చదవలేదని గాని, చెడు సావాసాలవల్ల పాడైపోయి పరీక్షలో తప్పారని ఏ ఒక్క విద్యార్థి తల్లిగాని, తండ్రిగాని అనరే! మేష్టరు చెప్పకపోవడంవల్లనే పరీక్ష పోయిందని వారి విశ్వాసం. చదవకుండా పరీక్షకి వచ్చి కాపీ చేస్తుంటే కేవలం సత్యస్వరూపుడుగా వున్న మేష్టరు చూడలేక పట్టుకుంటే ఆ తప్పూ మేష్టరిదే. వీధినిపోయేవాళ్లలోనైనా, యిరుగుపొరుగువారిలోనైనా సరే "మాటాడా యీ న్యాయం? కాపీ చేస్తే తప్పులేదు. పట్టుకుంటే తప్పట." అని చెప్పుకుంటే పోనీ వారైనా సానుభూతి తెలియజేస్తూ ఒక్క మాట అయినా అంటారేమోనని ఆశపడితే అదీ శూన్యమే! "పోనీ నీ సొమ్మేంపోయింది. కాపీ చేస్తుంటే పూరుకోలేకపోయావా?" అంటారు.

ఇక ఏ పరీక్షపత్రాలు దిద్దడమో వస్తే (ఎగ్జామినర్ షిప్) మార్కులకోసం సోర్సు, రాయ్సు కాగితాలో పూర్తోసి పెద్దలకాయలంతా మేష్టరు చుట్టూంగా శరూగు! బెదిరించి మార్కులు వేయించుకుంటారు అతనిపై అధికారులచేత నిర్బంధించి సిఫార్సుపత్రం తీసుకువస్తారు. నీతి, నియమం, ధర్మం, న్యాయం మొదలైనవాటికి స్వస్తిచెప్పి వారి చేతిలో కీలుబొమ్మ కావలసిందే మేష్టరు! డబ్బు చూపించి భ్రమపెట్టేవాళ్లనికూడా లేకపోలేదు. దీనికి ఉన్నతాశయాలుగల మేష్టర్లు లొంగరు. కాని, స్కూలు మేష్టరు కంత ఉన్నతాశయా లేమిటి? స్వల్పాదాయం తక్కువగల ఉద్యోగుల కంతంత పెద్ద ఆశయాలుంటే సాగదు.

మేష్టరు మధ్యతరగతికి చెందినవాడు.

(48-వ పేజీ చూడండి)

(11-వ పేజీ తరువాయి)

# సంఘానికి వెన్నుముక! ★

అతని జీతం చాలదు. చాలకపోయినా నాలుగుగోడలమధ్య ఎలాగో కాలక్షేపం చేస్తాడు. పాటకపు జాతిలో స్త్రీ పురుషులు కాయకష్టపడి డబ్బు సంపాదించుకుంటారు. కాని, మేష్టరు తినే కుటుంబానికి సొమ్ము సంపాదిస్తాడు. మానుషానికి మగ్గుతారు కాని మధ్యతరగతి కుటుంబాల మహిళలు డబ్బుకోసం ఏ పని పాటలూ చేయడానికి సిద్ధపడరు.

ఈ ఆలోచనలతో రామారావు మెల్లిగా తనబసకు చేరాడు. జరిగిన సంగతి తోటి వాచర్లతో చెబితే వాళ్లలో సీనియర్లిద్దరు ఒకరి మొగం ఒకరు చూచి నవ్వుకున్నారు. ఆ నవ్వు యెందుకో రామారావుకి అర్థం కాలేదు. బహుశః వాళ్లిన్నిగదులలో ఎప్పుడూ కాపీ చెయ్యలేదేమో? అనుకున్నాడు. మిగిలినవాళ్లు మాత్రం రాఘవులు చేతిలోపడి తిన్నగా వచ్చినందుకు ఎంతో అభినందించారు రామారావుని.

పరీక్షలలో విద్యార్థులు ఒకరితో ఒకరు మాట్లాడకుండా, కాపీచెయ్యకుండా వుండడానికే వాచర్లు తమ శాయశక్తులా తంటాలు పడుతూవుంటారు. ఏది కావలసినా విద్యార్థి వాచరుదగ్గిరకి రారాదు. లేచి నిలబడితే వాచరు అతనికి కావలసినవి తెచ్చియిస్తాడు. ఇది ఒక మార్గంగా తీసుకుని అక్కరలేకపోయినా ఏదో కావాలని అడగడం, ఆయన అటు వెళ్లి వచ్చేలోగా కాపీ చెయ్యడం, లేదా ఏ కాలిగోరుమీదో, కాలిమీదో, అరచేతిలోనో వ్రాసిన దానిని చూచి వ్రాసుకోవడం, టోపీలో పెట్టి తెచ్చుకున్న కాగితాన్ని తీసి చూచుకోవడం, (గాలికోసం తీసినట్లు టోపీతీసి) చొక్కా చేతిమడతల్లోనో, బూట్లలోనో తెచ్చుకున్న కాగితాన్ని తీసి చూసుకుందుకు చేతిమడతలు సవరించుకోవడం, జోళ్ళలోంచి కాళ్ళుతీసి నేలవైపు ఆలోచిస్తున్నట్లు చూడడం ఇత్యాదులు జరుగుతూంటాయి. ఇలాంటివి వాచరు చూసి ఫిర్యాదుచేస్తే విద్యార్థులకీ, వారి తరఫు వారికీ కోపం, కక్షకట్టడం. పీకలమీదికి రావడం. ఫిర్యాదు చెయ్యకపోతే వాచరు అధికారుల ఆగ్రహానికి గురికావలసిందే! తనవిధిని నిర్వర్తించనివానిక్రింద, అసమర్థునిక్రింద లెక్కకు వచ్చి ఉద్యోగానికే ముప్పు. ముందు నుయ్యి. వెనక గొయ్యి. వదలమంటే పాముకి కోపం; పట్టమంటే కప్పకి కోపం.

రామారావుకి ఆరాత్రి కంటిమీద రెప్ప మూత పడలేదు. కన్నుమూస్తే రాఘవులు భయంకరాకారం కనబడుతోంది. పరీక్షల సందర్భంలో జరిగినవెన్నో విన్నాడు. అవన్నీ ఒక్కొక్కటే జ్ఞాపకం రాసాగాయి.

రామారావుకి శర్మ అనే స్నేహితుడుండేవాడు. ఆయనా మేష్టరే. వాచరుగా వెళ్ళాడు ఒక వూరికి. అతని గదిలో ఒక విద్యార్థి పేపరు పుచ్చుకున్న అరగంటకి వెళ్లిపోయాడు. అక్కడికి దగ్గరలో నేవున్న ఒక యింట్లోంచి మెగాఫోనులో ఆనాటి పరీక్షప్రశ్నలకు జవాబులు పుస్తకంలో చూసి ఎలక్షన్ కాన్వాసింగ్ గొంతుకతో చెప్పేస్తున్నాడు. తలలు యెత్తకుండా విద్యార్థులంతా చెవులతోవింటూ చేత్తో రాసేశారు. వాచరు కాదుగదా బ్రహ్మదేవుడైనా ఏమీ చెయ్యలేని పరిస్థితి అది. ప్రశ్నలు పైకి ఎలా పొక్కాయని హెడ్ మాష్టరు వాచర్లనడిగారు. శర్మగదిలో తప్ప మిగిలిన గదులలోంచి విద్యార్థులు యెవ్వరూ వెళ్ళలేదు అని తేలింది. ఫలానా నంబరు విద్యార్థి వెళ్లాడనీ, వెళ్లిన మరి కాస్తసేపటికే జవాబులు వినిపించాయని శర్మ చెప్పాడు. బహుశః అతనే అయివుంటాడని అన్నాడు. ఆచోకీతీసి ఆ విద్యార్థిని పట్టించాడు హెడ్ మాష్టరు పోలీసులచేత.

తెల్లవారేసరికి వూరంతా గుప్పుమంది. "ఎవరో శర్మగారనే మేష్టరుట. హత్యచేయబడ్డాడు" అని. ఆ విద్యార్థి తాలూకు వాళ్లలో ఒకాయన శర్మగారిని "మేష్టారూ" అని పిలిచి అతను యివతలకి రాగానే కత్తితో కుండెల్లో ఒక్కపోటు పొడిచాడుట. హంతకుడు పారిపోయాడుట. తోటి వాచర్లు చెప్పారు. వారి బసలో జరిగిందీ హత్య....

కాపీ చేస్తుండగా చూసిన ఒక వాచరుని విద్యార్థి ముక్కుమీద పిడికిలి బిగించి గుద్దుటవల్ల వాచరు ముక్కు, నోట రక్తం కక్కుకుని పడిపోయాడు నిలబడ్డచోటే...

ఒకచోట కాపీ చేస్తున్న విద్యార్థి దగ్గరకి వచ్చి నిలబడిన వాచరుని ఆ విద్యార్థి కోపంతో మొలలోంచి కత్తి చప్పున లాగి "జాగ్రత్త" అని బెదిరించాడుట. పైగా "రిపోర్టు చేశావా నీప్రాణాలు దక్కవు" అన్నాడుట.

ఆ వాచరు రెండేళ్ళలో రిటైర్ కాబోతున్నాడు. పెద్ద కుటుంబీకుడు. అంతా ఆడసంతానం. చేతికి అక్కరకువచ్చే మగబిడ్డలు లేరు. ఒక్కరెక్క సంపాదన. ఏదో ఒకలాగ సంసారం నెట్టుకు వస్తున్నాడు. పెద్దతనంవల్ల చాలాసేపు నిలబడాలేడు. కూర్చోనూలేడు. తిరగనూలేడు. పోనీ "వాచింగు వొద్దు" అందామనుకుంటాడు. కాని, రోజుకి రెండున్నర, ఏఖర్చుకైనా వస్తుంది. పిల్లలజీతానికైనా వస్తుంది. ఇల్లాలి కోక ముతకకోక కావచ్చు. ఎన్నాళ్లనుంచో చిన్నపిల్ల పువ్వుల పరికిణీఅంటోంది. ఎలాగో కష్టపడితే పదిరూపాయల పైచిలుకు కళ్లబడుతుంది. అని కక్కుర్తి పడి వచ్చాడు. ఆకత్తి చూసి ఖంగారుపడిపోయాడు. ఆ తరవాత రెండుసంవత్సరాలు పనిచేసినా వాచరుగా వెళ్ళలేదు...

"ఇన్ని బాధలకు గురి అయే వాచరు యుద్ధవీరుడువంటివాడు. యుద్ధవీరుడిలాగే వాచరు బ్రతుకూ యింటికి వచ్చేదాకా నమ్మకం లేదు. ఈరోజులలో ఇళ్ళదగ్గిర ఆడవాళ్లు పరీక్షలకు వెళ్ళిన తమభర్తలు తిరిగి వచ్చేదాకా వెయ్యిదేవుళ్ళకు మొక్కుకుంటారేమో పాపం" అనుకుని ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు రామారావు.

ఆఖరిపరీక్ష పూర్తయిపోయింది. ఆన్సరు బుక్కులు హెడ్ మేష్టరికి అప్పగించేస్తే వూరికి వెళ్ళిపోవచ్చు వాచర్లు. రామారావు విద్యార్థులవద్దనుండి ఆన్సరుబుక్కులు తీసుకున్నాడు. కట్టకడపటి పేపరులోంచి నాలుగు అచ్చుకాగితాలు క్రిందపడ్డాయి. తీసి చూశాడు రామారావు. పరీక్షలో అడిగినప్రశ్నలకు జవాబులు ఆ పేపర్లలో వున్నాయి. ఆన్సరుబుక్కు, ఆ కాగితాలు దగ్గిర పెట్టుకుని చూశాడు. వాటిలోనుంచి ముక్కకి ముక్కగా కాపీ చేశాడు విద్యార్థి. తను చదువుకుందుకు తెచ్చినట్లు తెచ్చుకుని కావలసిన కాగితాలు చింపుకొని సావకాశంగా కాపీ చేసుకున్నాడు. మూలగా కూర్చోవడంచేత ఎవ్వరూ కనుక్కోలేకపోయారు. ఖంగారులో ఆ కాగితాలు తీసెయ్యడం మరిచిపోయాడు విద్యార్థి. ఆ గదిలో రామారావుతోపాటు మరిద్దరు వాచర్లున్నారు. అచ్చుకాగితాలు క్రిందపడ్డం ఆ వాచర్లు, విద్యార్థులూ చూశారు. నలుగురిలో పడిపోయిన విషయం కనుక రిపోర్టు చెయ్యక తప్పదు. ఇటు ధర్మం. అటు భయం. ఏది ఎక్కువ? ఆలోచిస్తే ధర్మంవైపే మొగ్గు చూపింది అతని అంతరాత్మ. ఆ విద్యార్థి రాఘవులు కొడుకే! అయినా సరే. వెళ్ళి రిపోర్టుచేశాడు నిర్భయంగా. కేసు రికార్డయింది

రామారావు ఆ సాయంత్రమే రైలుకి బయలుదేరాడు. ఆ వీధి చివర మలుపు తిరిగితే రైలుస్టేషన్ పదిబారల దూరంలోవుంది. రామారావు మలుపులోకి వచ్చేసరికి రైలుకి సిగ్నలిచ్చారు. చేతిలో సూట్ కేసుతో గబగబా నడుస్తున్నాడు. వెనుకనుండి యెవరో తలమీద బలంగా మోదారు "అమ్మా" అంటూ చేత్తో తలపట్టుకుని అక్కడే పడిపోయాడు వాచర్ రామారావు. కొట్టినవాడు పారిపోయాడు. నలుగురూ మూగి స్పృహతప్పి, నెత్తురు మడుగులో వున్న రామారావుని ఆస్పత్రిలో చేర్పించారు.

ఇంటిదగ్గిర రామారావు ఇల్లాలికి తెల్లవార్లూ పీడకలలే !!! ★